www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 డిసెంబరు 2022

5

ఏలూరు

పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ విడుదల

ఏలూరు: 2023-24 సంవత్సరానికి నాబార్డ్ రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్స్ (పిఎల్‌పి)ని స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎల్‌పి ఫైనాన్స్ స్కేయిల్, యూనిట్ ఖర్చులు, గ్రౌండ్ లెవెల్ క్రెడిట్ ఫ్లో సరళి, మారుతున్న పద్ధతులను పరిగణనలో తీసుకుని నాబార్డు రూపొందించిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ప్రాధాన్యతా రంగాల కింద లభించే క్రెడిట్ సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి దోహదపడుతుందన్నారు. నాబార్డు డిడిఎం టి.అనిల్‌కాంత్ మాట్లాడుతూ నాబార్డ్ 1989 నుండి దేశంలోని అన్ని జిల్లాల కోసం పిఎల్‌పిలను ప్రచురిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, ఆర్‌బిఐ ఎజిఎం శరత్‌చంద్ర, ఎల్‌డిఎం ఎస్.వెంకటేశ్వరరావు, డిసిసిబి సిఇఒ. బి.శ్రీదేవి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మాన్యుయేల్, ఉద్యానశాఖ డిడి పాండురంగ, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఏసుదాసు పాల్గొన్నారు.

ఆశావహుల్లో టెన్షన్..!

తెలుగు తమ్ముళ్లలో ఎడతెగని తర్జనభర్జన

చింతలపూడి, పోలవరం, ఉండి స్థానాలపై తీవ్ర చర్చ

జనసేన, బిజెపితో పొత్తు కుదిరితే పలు స్థానాల్లో మార్పులు

నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా ఉన్నా టిక్కెట్లపై టెన్షన్

పలుచోట్ల వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు టికెట్లపైనా ఉత్కంఠ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే గడువు ఉంది. దీంతో ఎంఎల్‌ఎ టిక్కెట్ ఆశిస్తున్న నాయకులంతా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలను హోదాపరంగా ప్రజల్లో తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ తమకే వస్తుందనే ఆశతో అంతా ముందుకు సాగుతున్నారు. కొంతమంది నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా ఉన్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ వస్తుందా.. లేదా అనే టెన్షన్ మాత్రం నాయకులను వెంటాడుతోంది. ముఖ్యంగా ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి నాయకుల్లో టిక్కెట్ల టెన్షన్ నెలకొంది. అధికార వైసిపిలోనూ సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు టిక్కెట్ ఉంటుందా.. లేక మార్పులు చోటుచేసుకుంటాయా అనే ఉత్కంఠ నడుస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ వచ్చే ఎన్నికలపై దృష్టి సారించాయి. జిల్లాలో సిఎం పర్యటన జరిగిన వెంటనే టిడిపి అధినేత చంద్రబాబు సైతం మూడు రోజులపాటు దెందులూరు, చింతలపూడి, పోలవరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పర్యటన సాగించారు. ఈ పర్యటనలో నెలకొన్న కొన్ని పరిణామాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. చింతలపూడి నియోజకవర్గ టిక్కెట్ ఎవరికిస్తారనే చర్చ నెలకొంది. ఇక్కడ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించలేదు. ఇక్కడ ఆది నుంచి టిడిపిలో గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో ఇక్కడ టిడిపి గెలిచినా ఐదేళ్లు గ్రూపు రాజకీయాలతో ఘర్షణలు సాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ అదే పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఎంఎల్‌ఎగా గెలిచి మంత్రిగా పని చేసిన పీతల సుజాత మళ్లీ చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్నారు. అదేవిధంగా మాజీ జెడ్‌పి ఛైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు టిక్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. వీరిద్దరూ కాకుండా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన కర్రా రాజారావు కుమారుడు కార్తీక్ టిక్కెట్ ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ ఎంఎల్‌ఎగా పని చేసిన మద్దాల రాజేష్ టిడిపి తరుపున టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఎవరికి టిక్కెట్ వస్తుందనే ఉత్కంఠ నెలకొంది. పీతల సుజాత, జయరాజు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ చంద్రబాబు పర్యటనలో స్పష్టత మాత్రం రాలేదు. పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బొరగం శ్రీనివాస్ ఉన్నారు. ఈయనకే టిక్కెట్ అంటూ ప్రచారం సాగుతోంది. అదే తరుణంలో మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్ సైతం చంద్రబాబు పర్యటనలో హడావుడి చేశారు. టిక్కెట్ సైతం ఆశిస్తున్నారు. దీంతో ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇస్తారనే చర్చ నడుస్తోంది. నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఉన్నారు. ఈయనతోపాటు పర్వతనేని గంగాధర్ టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఎవరిని టిక్కెట్ వరిస్తుందో వేచిచూడాలి. ఇక ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎగా మంతెన రామరాజు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇవ్వనున్నట్లు ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. అయితే ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు ఉండి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో టిక్కెట్ ఎవరికిస్తారనే చర్చ నెలకొంది. కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా జయమంగళ వెంకటరమణ ఉన్నారు. యాదవ సామాజిక తరగతి నుంచి విజయలక్ష్మి అనే మహిళ టిక్కెట్ ఆశిస్తుండటంతో ఇక్కడా ఉత్కంఠ నెలకొంది.

పొత్తు కుదిరితే పలుస్థానాల్లో అనూహ్య మార్పులు

టిడిపి, జనసేన, బిజెపి పొత్తుపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నడుమ పొత్తు కుదిరితే పలు నియోజకవర్గాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకునే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు. పొత్తు కుదిరితే కైకలూరు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ బిజెపి తరుపున పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వలవల బాబ్జి ఉన్నారు. టిడిపి, జనసేన పొత్తు కుదిరితే ఈ టిక్కెట్ జనసేనకు వెళ్తుందని, జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ పోటీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉంగుటూరు నియోజవర్గంలోనూ జనసేన తరుపున ధర్మరాజు పోటీ చేయనున్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే గన్ని వీరాంజనేయులకు ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉంది. నరసాపురం టిక్కెట్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, కొవ్వలి నాయుడు వంటివారు ఆశిస్తున్నారు. పొత్తు కుదిరితే జనసేన తరుపున బొమ్మిడి నాయకర్ పోటీచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భీమవరంలోనూ జనసేన పోటీచేసే పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. టిడిపి, జనసేన పొత్తు కుదిరితే ఎన్నికల సమయంలో టిక్కెట్ల కేటాయింపులో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటాయని రాజకీయ పరిశీలకుల అంచనా. అధికార పార్టీ వైసిపిలోనూ సిట్టింగ్ ఎంఎల్‌ఎలను మార్చి పలు స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు దక్కనున్నట్లు ప్రచారం సాగుతోంది. పేర్లు బయటికి రాకపోయినప్పటికీ ఆ పార్టీ నాయకుల్లో మాత్రం విస్తృత చర్చ నడుస్తోంది.

విరివిగా విద్యారుణాలు అందించండి

31 నాటికి అన్ని బ్యాంకుల్లో డిజిటల్ లావాదేవీలు

బ్యాంకర్ల కమిటీ సమావేశంలో జెసి పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

విద్యారుణాలు అందించడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బ్యాంకర్లను జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక గౌతమి సమావేశ మందిరంలో 2022-23కు సంబంధించి రెండో త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించే కోర్సుల్లో చేరడం, ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లడం చాలామంది విద్యార్థుల కల అని, అటువంటి విద్యార్థుల కలను సాకారం చేసేందుకు విరివిగా విద్యారుణాలు అందించాలని అన్నారు. జిల్లాలో రూ.72.24 కోట్ల 31 బ్యాంకుల ద్వారా అందించాలనే లక్ష్యానికి ఇంత వరకు రూ. 31.75 కోట్లు (44శాతం) మాత్రమే అందించారన్నారు. ఈ దృష్ట్యా విద్యా రుణాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సూచించిన లక్ష్యం సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. జగనన్నతోడు, పిఎం స్వానిధి, పిఎంఇజిపి, టిడ్కో రుణాల మంజూరుపై పూర్తి దృష్టి పెట్టాలన్నారు. 2022-23 వార్షిక రుణ లక్ష్యం రూ.12,807 కోట్లు కాగా, వ్యవసాయానికి రూ.7,407 కోట్లు అని తెలిపారు. మొత్తం ప్రాధాన్యతా రంగాలకు రూ.10257 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.2550 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. మొదటి ఆరు నెలల్లో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు రూ.2,722 కోట్లు, కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులకింద రుణాలు 7,405 మంది రూ.46.79 కోట్లు అందించారన్నారు. మొత్తం వ్యవసాయానికి సంబంధించి రూ.4,633.60 కోట్లు రుణాలుగా అందించారన్నారు. డిజిటల్ లావాదేవీలు పూర్తిస్థాయిలో డిసెంబర్ 31 నాటికి నిర్వహించాలే ఆదే జిల్లాల్లో ఏలూరు జిల్లా ఒకటి అని, ఆ దిశగా అన్ని బ్యాంకు శాఖల్లో డిజిటల్ లావాదేవీలు నూరుశాతం నిర్వహించాలన్నారు. డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎస్ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, చాలా ఒత్తిడి మధ్య బ్యాంకర్లు అందిస్తున్న సేవలు మరువరానివన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

30 శాతానికిపైగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలి

కౌలు, పేద రైతులకు రబీ రుణాలివ్వాలి - ఎపి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - ఏలూరు

పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా అన్ని పంటలకు పంట రుణ గరిష్ట పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) 30 శాతానికి పెంచాలని, కౌలు రైతులందరికీ రబీ రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఎపి రైతు సంఘం వినతిపత్రం సమర్పించింది. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని పంటలకూ ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఎరువులు, పురుగుమందులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు వల్ల వ్యవసాయ సాగు ఖర్చులు గతం కంటే 30 నుండి 40 శాతం పెరిగాయన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట కోత మిషన్ల కిరాయిలు, పంటల రవాణా ఛార్జీలు పెంచేశారన్నారు. కొన్ని పంటలకు ఆదాయం పెరిగినా పెరిగిన ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచకపోవడం వల్ల రైతులు ప్రయివేట్ అప్పులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. పంట రుణాల మంజూరు సమయంలో వస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు రైతు సంఘాలు, బ్యాంకర్లతో సంయుక్త సమావేశాలు నిర్వహించాలని కోరారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని

నేడు విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల ఏడో తేదీన స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాచరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం కార్యదర్శ ఎ.రవి తెలిపారు. స్థానిక బస్టాండ్ పక్కన ఉన్న కుంజా బొజ్జి, సున్నం రాజయ్య సభా ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటలకు సాంస్కృతిక సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. దేశభక్తి, అభ్యుదయ పాటల పోటీలు, వివిధ కళా పోటీలు నిర్వహించి సాయంత్రం ఏడు గంటలకు విజేతలకు ప్రజాకవి, తెలంగాణ ఎంఎల్‌సి గోరేటి వెంకన్న ద్వారా బహుమతులు అందజేస్తామని తెలిపారు.

జెండా ఆవిష్కరణలో నేతలు

జండా ఆవిష్కరణలు

గణపవరం: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ సందర్భంగా మండలంలో జల్లి కాకినాడ, కేశవరం గ్రామాల్లో మంగళవారం జెండా ఆవిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో ఈనెల 8,9,10 తేదీల్లో ప్రారంభమైన రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు సుబ్రహ్మణ్యం, సంజీవరావు, శ్రీను, మహేష్, నాగేశ్వరరావు, మరియమ్మ, పల్లయ్య పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

నిడమర్రు : వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. పెదనిండ్రకొలనులో ఆశా వర్కర్స్ యూనియన్ మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణరావు మాట్లాడుతూ ఈ మహాసభకు కేరళ సిఎం పినరయి విజయన్ హాజరవుతున్నారని తెలిపారు. స్కీమ్ వర్కర్లు ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిల్ల హారికుమారి, అల్లు సత్యవతి, కంచం సుబ్బలక్ష్మి, కె.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అన్నీ అవకతవకలే

సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి అక్రమాలు - ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - ముసునూరు

చనిపోయిన వ్యక్తి ఉపాధి హామీ పనులు చేయడం, మొక్కలు నాటకుండా రికార్డుల్లో మాత్రమే చూపడం, మస్తరు వేయకుండా నగదు ఖాతాల్లో జమచేయడం వంటి అవకతవకలు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన చట్టం పారదర్శకతకు మాయని మచ్చగా నిలిచింది. మంగళవారం ముసునూరులోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీని డ్వామా పీడీ డి.రాంబాబు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధికారి పరవేక్షణ లోపం వల్ల గోపవరంలో చనిపోయిన వ్యక్తులు ఉపాధి పనికి వచ్చినట్లు వేలి ముద్రలుండటం, ఒకే ఇంటిలో ఒకే రేషన్‌కార్డులో ఇద్దరికి వేర్వేరు జాబ్ కార్డులు ఉండటం గుర్తించారు. ఈ క్రమంలో అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ఉపాధి మేట్‌ను కూడా సస్పెండ్ చేశారు. అలాగే మస్తరులో పని దినాలు తక్కువగా ఉండటం, వారి ఖాతాల్లో ఎక్కువ నగదు జమ చేయడం, కొన్ని గ్రామాల్లో పని ఒక చోట చూపి, వేరే చోట పనిచేయించడం, తక్కువ పని చూపి ఎక్కువ పని ఉన్నచోటకు మార్చి ఎక్కువ ఎస్టిమేట్ వేసినట్లు కాత్రేనిపాడులో గుర్తించారు. కొన్ని గ్రామాల్లో నిమ్మ, జామ, మామిడి మొక్కలు రికార్డులో మాత్రమే ఉన్నట్లు చూపడం, పోలంలో మొక్కలు లేకపోవడాన్ని కూడా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో రికవరీ విషయంలో రూ.2,34,575 జమ చేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్సుపర్సన్ టి.వెంకటేశ్వరరావు, జిల్లా విజిలెన్సు అధికారి ఎవి.విజయలక్ష్మి, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎపిఒ జయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

'ఇదేం ఖర్మ'లో ప్రజల సమస్యలు గుర్తించాలి

కొయ్యలగూడెం: ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని నమోదు చేసుకోవాలని పోలవరం నియోజకవర్గం టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. టిడిపి ప్రజల తరుపున చేస్తున్న ఈ పోరాటానికి మద్దతుగాం 91-9261292612 నంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చేలా వారికి పూర్తి సమాచారం అందించాలన్నారు.

భీమడోలు: టిడిపి ఆదేశాల మేరకు నిర్ణీత నమూనా పత్రాలతో ఇంటింటికీ తిరిగి 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం భీమడోలులో ప్రారంభించారు. తెలుగుదేశం శ్రేణులతో కలిసి ఇంటింటా పర్యటించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సందర్భంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కరణం పెద్దిరాజు, ఎంపిసి మాజీ ఛైర్మన్ పుల్లయ్య నాయుడు, టిడిపి ప్రముఖులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

గోనె సంచులు అందుబాటులో ఉంచాలి : జెసి

జంగారెడ్డిగూడెం: రైతులకు అవసరమైన గోనె సంచులను మిల్లర్లు అందుబాటులో ఉంచాలని జెసి పి.అరుణ్ బాబు సూచించారు. మంగళవారం స్థానిక పాత బస్టాండ్‌లోని విష్ణు ప్రియ మోడరన్ రైస్ మిల్లులో రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఆర్‌డిఒ జాన్సీరాణి, తహశీల్దార్ కె.స్లీవజోజి, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దార్ సుధాకర్, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మండవల్లి: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంపై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల వెంబడి చెత్తను వేయరాదని, సంపద కేంద్రాలకు తరలించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు, గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది తప్పనిసరిగా నూరు శాతం హాజరు ఉండాలన్నారు. అంతేకాకుండా సచివాలయంలో అటెండెన్స్, మూమెంట్, స్పందన, రిజిస్టర్‌లను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమానికి ఎంపిక చేసిన గన్నవరం భైరపట్నంలో కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో తడి పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మి కంపోస్ట్‌ను తయారు చేసే విధంగా తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచాలి

భీమడోలు: ప్లాస్టిక్ నిషేధంపై ప్రతీ దుకాణం వద్ద గుడ్డ బ్యానర్లు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ రాఘవన్, తహశీల్దార్ జాన్‌రాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆరు అంశాలపై మంగళవారం సమీక్షించారు. ఓటర్ల నమోదు లక్ష్యాలు, ప్లాస్టిక్ నిషేధంపై కార్యాచరణ, చెరువుల ఆక్రమణలు గుర్తించడం, ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణాల ప్రగతిపై చర్చించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లిప్తత తగదు

అధికారులకు గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్ వివివి.భాస్కర్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ధాన్యం కొనుగోళ్లలో సంబంధిత అధికారులు నిర్లిప్తతతో వ్యవహరిస్తున్నారని గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్ వివివి.భాస్కర్ ఆరోపించారు. ఈ అంశంలో వివిధ దశల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడానికి సొసైటీలను బాధ్యులుగా చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన అధికారులకు ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో 13,736 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరగ్గా ఇప్పటి వరకూ 11,880 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయని భాస్కర్ తెలిపారు. 30 వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, అయితే అధికారులు కేవలం 11,155 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని పేర్కొన్నారు. మిగిలిన ధాన్యం రోడ్లపైన, ఖాళీ స్థలాల్లో, కొన్నిచోట్ల ఆరుదల కోసం ఉంచారని పేర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారని, మరోవైపు ధాన్యం అమ్మకం సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై పౌర సరఫరాల శాఖాధికారులను సంప్రదిస్తే వారు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన గోనెసంచులు, లారీలు అందుబాటు విషయమై మాట్లాడటం లేదని ఆరోపించారు. ఒకవేళ రైతులు రవాణా ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్తే దాని బాధ్యత సొసైటీలదని చెబుతున్నారని పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా అమ్మకానికి అనుమతి పొందిన ధాన్యాన్ని రైతులు వారి సూచన మేరకు రవాణా ఖర్చులు భరించి పంపిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. సదరు రవాణా ఛార్జీలు రైతులకు కాక లారీల యూనియన్ పేర జమవుతున్నాయని పేర్కొన్నారు. మండలంలో రైతుల అవసరాలకు సరిపడా లారీలు లేవని, మిల్లర్లు పంపే అతి తక్కువ సంఖ్యలో లారీలపై ధాన్యాన్ని రవాణా చేయాల్సి ఉందని తెలిపారు.

95 వేల గోనె సంచులు అవసరమని తెలిపాం

పౌర సరఫరాల శాఖాధికారులు

మండలానికి 95 వేల గోనె సంచులు అవసరం ఉంటాయనిఉన్నతాధికారులకు తెలిపామని పౌరసరఫరాల శాఖాధికారులు వివరణిచ్చారు. ఇదే క్రమంలో సోమవారం 57 లారీలను పంపాలని కోరామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతులకు ఇబ్బంది లేని విధంగా ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు.

ఆయిల్‌పామ్ కార్మికుల వేదన.. అరణ్యరోదన

కనీసం గుర్తింపు కార్డులూ ఇవ్వని వైనం - కనీస వేతనాలు, ఎక్స్‌గ్రేషియా లేక విలవిల - సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

పని చేస్తేనే పూట గడిచే బతుకులు.. రైతు పండించే పంటలో 80 శాతానికిపైగా శ్రమ వీరిదే. మొక్క వేసిన దగ్గర నుండి పంట చేతికొచ్చే వరకూ రైతులకు అండగా ఉంటారు. ఇంత చేసినా ఆ శ్రమ జీవులకు మాత్రం ఎటువంటి గుర్తింపూ లేదు. వారే పామాయిల్ కార్మికులు.. ఇది ఆయిల్‌పామ్ తోటల్లో పని చేసే శ్రమ జీవుల గోడు..

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల ఉద్యాన పంటలను రైతులచే సేద్యం చేయిస్తోంది. వాటిలో పామాయిల్ సాగు ప్రధానమైంది. రాష్ట్రంలో మెట్టప్రాంతంలో, భూగర్భ జలాలు విస్తారంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంట బాగా పండుతోంది. దీని దిగుబడి మాములు ప్రాంతాల్లో పండే దానికంటే ఈ ప్రాంతంలో రెట్టింపు ఉంటుంది. సుమారు 2.57 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగవుతోంది. అతితక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం వచ్చే నేపథ్యంలో రైతులు వరి సాగు స్థానంలో ఈ పామాయిల్ సాగు చేస్తున్నారు. దీనికి ఉద్యాన, ఇరిగేషన్, విద్యుత్ శాఖ పలు రాయితీలిస్తున్నాయి. పంట సాగు కోసం ఉద్యాన అనుబంధ సంస్థలు, బోర్డులు, ఏజెన్సీలు, నోడల్ ఏజెన్సీలతో పలు పథకాలను రైతులకు అందిస్తోంది. ఆయిల్‌పామ్ చట్టం-1993 ప్రకారం జాతీయ ఆహార భద్రత మిషన్, ఆయిల్‌పామ్ (ఎన్ఎఫ్ఎస్ఎం-ఎపి) ప్రకారం రాష్ట్రంలో అన్ని ఆయిల్‌పామ్ కంపెనీలు, ప్రభుత్వం ఐదు నుండి 40 సంవత్సరాలు ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పంట తీసుకునేలా ఆయిల్‌పామ్ (నవభారత్, గోద్రెజ్) కంపెనీల నుంచి ముడి పామాయిల్ ఉత్పత్తిని తీసుకుంటుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ఫ్యాక్టరీలకు అనేక రాయితీలు కల్పిస్తోంది. మొక్క సరఫరాలో 85 శాతం సాగు చేయడానికి నాలుగు సంవత్సరాలకు 50 శాతం, తోటలో అంతర పంటలకు నాలుగు సంవత్సరాలకు 50 శాతం రాయితీలు ఇస్తుంది. బోరుబావులకు, సేద్యం కోసం మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిబంధనలు అమలు చేస్తోంది. ఈ విధంగా ఎకరాకు మూడు నుండి ఆరు టన్నుల పంట పండుతోంది. ఫ్యాక్టరీల్లో పంటకు మంచి మద్దతు ధర ఇస్తుంది. సుమారు టన్నుకు రూ.20 వేల నుండి రూ.23 వేల వరకు పలుకుతోంది. ఈ పంటలో రైతు పడే కష్టానికి రెట్టింపు ఆదాయం వస్తోంది. అయితే ఈ పంటలో పని చేసే కార్మికుల బతుకులు మాత్రం రోజురోజుకీ దయనీయంగా మారుతున్నాయి.

రాష్ట్రంలో పామాయిల్ పంటను నవభారత్, గోద్రెజ్, 3ఎఫ్ వంటి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తున్నాయి. వీటి యాజమాన్యం రైతులకు మంచి ఆదాయాన్నిస్తుండగా ఆ పంట అందించే కార్మికులకు మాత్రం మొండిచెయ్యి చూపిస్తున్నాయి. ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో రైతులే ప్రభుత్వ ఆధీనంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నడుపుతున్నారు. దీనిలో సుమారు ఐదు నుండి 10 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. చిన్న, సన్నకారు రైతుల దగ్గర నుండి భూస్వామి వరకు ఈ ఫ్యాక్టరీలో యజమానులుగా ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి అన్నిరకాల రాయితీలు కల్పిస్తోంది. దీన్ని చూసుకుని ప్రయివేట్ ఫ్యాక్టరీలు నవభారత్, గోద్రెజ్, 3ఎఫ్ వంటి బహుళజాతి సంస్థలు రెచ్చిపోతున్నాయి. కార్మికులకు కష్టమొచ్చినా, ప్రమాదాలు జరిగినా తమకు ఎలాంటి సంబంధమూ లేదని చేతులెత్తేస్తున్నాయి.

గుర్తింపు ఇచ్చేది.. ఎప్పుడు..?

ఏళ్ల తరబడి పామాయిల్ తోటల్లో పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి గుర్తింపూ లేదు. రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్‌కు, జిల్లా ఉద్యానశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగా ఉంది. వేలాది మంది కార్మికులకు గుర్తింపు ఇవ్వకపోవడానికి కారణం ఏమిటీ.. ప్రయివేట్ ఫ్యాక్టరీల యాజమాన్యంపై ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి తీసురావడం లేదు అనే అంశాలు కార్మికుల్లో చర్చనీయాంశమయ్యాయి. అందుకే ప్రభుత్వం స్పందించి పామాయిల్ తోటల్లో పనిచేసే కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పామాయిల్ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది.

అందని కనీస వేతనం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, ఉపాధిహామీ కూలీలకు అనేక చట్టాలు తెచ్చాయి. అయితే నేటికీ అమలుకు నోచుకోకపోవడం సిగ్గుచేటు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కనీస వేతనం కార్మికులకు దక్కకుండా సంస్కరణలు తీసుకొస్తోంది. దీనిలో పామాయిల్ కార్మికులు బలిపశువులుగా మారారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించిన కార్మికచట్టాలను దేశవ్యాప్తంగా కార్మికుల పొట్టకొట్టే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారు. దీనిలో భాగంగా కనీస వేతనాల చట్టప్రకారం నేడు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఎనిమిది గంటలు పని చేసే పామాయిల్ కార్మికునికి రూ.800 ఇవ్వాలి. ప్రస్తుతం రూ.600 ఇచ్చి రైతులు చేతులు దులుపుకుంటున్నారు. అత్యంత దారుణంగా లోడింగ్, అన్‌లోడింగ్ చేసే పురుషులకు రూ.400, మహిళలకు రూ.250 ఇస్తున్నారు. కూలీ పెంచుకోవడానికి, రాబోయే కాలంలో పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తుమ్మల సత్యనారాయణ, పామాయల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

ఏలూరు జిల్లాలో సుమారు లక్షా 80 వేల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. సుమారు 15 మండలాల్లో పంట సాగవుతోంది. దీనిలో పని చేసే కార్మికులు 15 వేల మందికిపైగా ఉంటారు. వీరందరూ 30 నుండి 40 సంవత్సరాలు వయస్సు కల్గిన వారు. వీరు అనేక సమస్యలతో బాధపడుతూ గత సంవత్సరం పామాయిల్ కార్మిక సంఘం ఏర్పాటు చేసుకున్నారు. పామాయిల్ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వడంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. తద్వారా కనీస వేతనం, ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియా వంటివి అందించేలా చర్యలు చేపట్టాలి.


నూతన కార్యవర్గం

ఎపి ఎన్‌జిఒ సంఘం భీమడోలు తాలూకా అధ్యక్షులుగా జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పూర్వపు తాలూకా (ద్వారకాతిరుమల, భీమడోలు, దెందులూరు మండలాల పరిధి) ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులుగా ఎంవి.జగన్మోహనరావు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గిరిధర్ తెలిపారు. భీమడోలు తాలూకా ఎన్‌జిఒ సంఘం సమావేశాన్ని భీమడోలులో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉద్యోగుల సంఘం జెఎసి సహాయ కార్యదర్శి (జనరల్) ఆర్‌ఎస్ హరనాధ్, ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా కార్యదర్శి రామారావు వ్యవహరించారు. మూడేళ్ల పదవీకాలంగా తాలూకా యూనిట్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఎన్నికల అధికారి గిరిధర్ తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా అధ్యక్షులు జగన్మోహన్‌రావుతో పాటు సహాధ్యక్షులుగా శేషాచారి, కార్యదర్శిగా సి హెచ్ కనకదుర్గ, ఉపాధ్యక్షులుగా ఎ.నాగరాజు, డి.శ్రీనివాసరావు, సిద్ధయ్య, సంయుక్త కార్యదర్శులుగా పివిఎస్ఎస్ బిఆర్.శర్మ, సిలార్ సాహెబ్, వైవిఎం సూర్యకుమార్, మహిళా ప్రతినిధిగా జె.కిరణకుమారి, కోశాధికారిగా ఫణికిరణ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎ.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ఎఎన్ఎంకు సాయం అందిస్తున్న వెంకటరాజు

ఆపన్నులకు అండగా ఉంటా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని సామాజిక కార్యకర్త నాటకశాల వెంకటరాజు అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి దీనావస్థలో ఉన్న అంకాలగూడెం ఎఎన్ఎం పూలపల్లి దుర్గాప్రశాంతికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. విధులకు వెళుతూ ఆమె ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. నిరుపేద కుటుంబమైన ఆమెను ఆదుకోవడం తన బాధ్యతగా భావించినట్లు వెంకటరాజు తెలిపారు.

ఫిజియోథెరపీ నోడల్ అధికారిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


శ్రీనివాసరావును అభినందిస్తున్న సిబ్బంది

ఏరియా ప్రభుత్వాసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు ఆలూరి శ్రీనివాసరావురావును జిల్లా ఫిజియోథెరపీ నోడల్ అధికారిగా నియమించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలూరి శ్రీనివాసరావుని సూపరింటెండెంట్ బేబీ కమల, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాపోలు బావనరుషి శుభాకాంక్షలు తెలిపారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

బిసి గర్జనను విజయవంతం చేయాలి : తెల్లం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈనెల ఏడో తేదీన వైసిపి నిర్వహిస్తున్న బిసి మహాసభ గర్జనను ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. గవరవరంలో మంగళవారం గ్రామ కన్వీనర్ చీమకుర్తి సత్యనారాయణ, ఎంపిటిసి బి.రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలను అందలమెక్కించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. రూ.83 వేల కోట్లను ఇప్పటికే బిసి అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం వెచ్చించిందని, 17 మంత్రి పదవుల్లో 11 మందిని బిసిలనే నియమించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, వైస్ఎంపిపి తుమ్మలపల్లి గంగరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న సిపిఐ నేతలు

టిడ్కో ఇళ్లు అప్పగించాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి తక్షణం అందించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలైనా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇళ్ళ అందజేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 90 శాతం ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేశారని, అనంతరం ఎన్నికలు జరిగి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఎఐటియుసి నాయకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించి, ఇళ్ల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి సభ్యులు పుప్పాల కన్నబాబు, బళ్ల కనకదుర్గారావు, మావూరి విజయ, కొల్లూరి సుధారాణి, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు నివాళి

జిల్లావ్యాప్తంగా వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో అన్ని తరగతుల వారికి సమన్యాయం జరగాలనే దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని దేశవ్యాప్తంగా మహాపరినిర్వాన్ దివస్‌గా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ కాంస్య విగ్రహానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య సాధికారతకు ఆవసరమైన అమూల్య రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను అనుసరించాలని దేశ ప్రగతిలో మనవంతుకర్తవ్యాన్ని నిర్వర్తించాలని బాధ్యత ఉందన్నారు. వారు అందించిన స్ఫూర్తితో సామాజిక సేవగా సంపూర్ణ విద్యావ్యాప్తికోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎవిఎన్ఎస్ మూర్తి, సోషల్ వెల్ఫేర్ జెడి ఎస్.మధుసూదనరావు, డిఆర్‌డిఎ పిడి ఏఓ.విజయరాజు, జెడిపి సిఇఒ కెవిఆర్.రవికుమార్, డిఎంహెచ్ఓ బిఆర్.రవి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండవల్లి: రాజ్యాంగం ద్వారా అన్ని సామాజిక తరగతులకు సమన్యాయం కల్పించిన మహోన్నతవ్యక్తి అంబేద్కర్ అని వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రధాన సెంటర్లో ఉన్న ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ వ్యక్తి కాదని మహాశక్తి అని అన్నారు. రాజ్యాంగం ద్వారా సమానత్వంతో పాటు, దేశ ప్రజలకు ఆత్మగౌరవం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బెంటు అప్పారావు, జై భీమ్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వట్టిపోలు సుధీర్, జేసుదాసు, గురు రమేష్, గోరింక గాంధీ, మార్పు రాజు, దాసరియోహాన్ రాజు పగుళ్ల, అభిన పాల్గొన్నారు.

చింతలపూడి : అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నేడు దేశంలో అందరికీ సమాన హక్కులు కల్పించబడ్డాయని ఎంపిపి బి.రాజబాబు, నగరపంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ మణికుమార్, సొసైటీ ఛైర్మన్ ఆత్మూరి సుబ్బారావు, ఎయిమ్ జిల్లా నాయకులు కర్ర సత్యం అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎయిమ్ ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతిని

ఏలూరులో..

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ వద్ద ఆయన ఒక రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సంఘ పరివార్‌తో కుమ్మక్కై సొంత అజెండాతో రాజ్యాంగాన్ని మార్చాలని కుయుక్తులు పన్నుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, ఆర్ఎస్ హరినాథ్, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి నాయకులు పొలిమేర హరికృష్ణ, రాజ్యాంగ పరిరక్షణ సమితి కో కన్వీనర్ పెదపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

స్థానిక మూడో డివిజన్‌లో అంబేద్కర్ వర్ధంతిని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ఆధ్వర్యంలో పార్టీ ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ బడేటి రాధాకృష్ణయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు మోజెస్ పాల్గొన్నారు.

గణపవరం : అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక మార్కెట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచి మోర అలంకారం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సరాది రత్నకుమారి, వైసిపి నాయకులు శెట్టి రాజా, రొంగల శ్రీను, తోట శ్రీను, గాజుల వెంకటేశ్వరరావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : అంబేద్కర్ ఆశయాన్ని నెరవేర్చాలని ఎంపిపి గంజిమాల రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణప్రసాద్, ఇఒపిఆర్డి జ్యోతి పాల్గొన్నారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని రాజవరంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో, గవరవరంలో అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.

ఆదర్శప్రాయులు అంబేద్కర్ అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని గవరవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డాటి నాగేశ్వరరావు, మద్దు గోపి, మట్టా సత్తిపండు, మారిశెట్టి శ్రీను, రొక్కాల నాగరాజు, ఆనంద మాస్టారు, నాని పాల్గొన్నారు.

మండవల్లిలో

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జ్యోతి, సొసైటీ ఛైర్మన్ సుబ్బారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఏలియ, ముత్తేశ్వరరావు, భాను కుమార్, నత్తా వెంకటేశ్వరరావు, రామారావు పండు, జైపాల్, దారా పేర్రాజు పాల్గొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, వెంపా కృష్ణ పాల్గొన్నారు.

దెందులూరు : అంబేద్కర్ వర్ధంతిని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు ఎంపిపి, జెడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు పాఠశాలల్లో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జీవిత చరిత్రను విద్యార్థులకు బోధించారు.

ఏలూరు అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.బెన్నీ, మాజీ ఎంఎల్‌సి ఆర్ఎస్ఆర్ మాస్టారు, డి.శిరీష, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్లు వి.నాగరాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఒక్కరోజు దీక్ష : రాజ్యాంగంలోని సోషలిజం, సెక్యులరిజం పదాలను తొలగించి అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్వరూపాన్ని మార్చివేసే కుట్ర జరుగుతోందని రాజ్యాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఎఎస్ఐ పాకా ప్రభాకర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.

గణపవరం : రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్నం చిన్ననాగేశ్వరరావు అన్నారు. అర్ధవరంలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిన్, బద్రి, అంబేద్కర్ ఇండియన్ మిషన్ నాయకులు అశోక్, గాతల శివాజీ, గూడ సువర్ణరాజు, కప్పల ఆనందరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : అంబేద్కర్ వర్ధంతిని స్థానిక సుందరయ్య భవనం వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అవమానాలు, వివక్షను ఎదుర్కొన్న అంబేద్కర్ సకల జనుల కోసం రాజ్యాంగం రచించారన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఐక్యత పెరుగుతుంటే బాబ్రీ మసీద్ కూల్చి లౌకికతత్వాన్ని దెబ్బతీశారని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, పి.కిషోర్, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, డివైఎఫ్ఐ నాయకులు మాబు సుభాని పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు సాధించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కె.లక్ష్మణరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సచివాలయ అడ్మిన్ చిట్టిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ విఆర్ఒ శ్రీరాములు, డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగ, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్‌రావు, కార్యదర్శి ఎస్‌కె.ఆసిఫ్, సభ్యులు అప్పారావు, వెంకటేశ్వరరావు, నాగేంద్ర పాల్గొన్నారు.

స్థానిక ప్రియదర్శిని కళాశాలలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పంతాగని వెంకన్న, కెఎస్.శంకర్‌రావు, రమణారావు, నాగ కుమార్, కడలి గాంధీ, నాగసూరి, బాల సుబ్రహ్మణ్యం, కృష్ణ, సిరి డైరెక్టర్ ప్రసాదరాజును మీడియా మిత్రులు ఘనంగా సన్మానించారు.

చింతలపూడి : దళిత బహుజనులకు రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు ఆయేనని ఆయన ప్రచార కమిటీ కార్యదర్శి యం.సూర్యకుమార్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి స్థానిక చైతన్య భారతి కళాశాలలో మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ వర్ధంతి రోజున ఆయన్ను తలుచుకోవడం అత్యవసరమని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో గిడ్డం ఎలీషా ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్భగూడెం పంచాయతీ లక్ష్మీపురంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగుమిల్లి సెంటర్‌లోని విగ్రహానికి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సందీప్, సీనియర్ అసిస్టెంట్ రమణ,వి ఆర్ ఓ లు, భాష,మాధురి, శాంతి అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని కేతవరంలో సర్పంచి తడికలపూడి శివమాధవి కిషోర్ ఆధ్వర్యంలో పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిటిసి సభ్యులు రాంబాబు, టి.వీరవెంకయ్య, యు.ప్రసాద్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లి : స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ గంటా సంధ్య, ఎం.ఏసుబాబు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్: అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ఫారెస్ట్ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, రిటైర్డ్ జెఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, నాయకులు నేతల రమేష్ బాబు, జక్కుల బెనర్జీ, మెండెం సంతోష్, పేరం రాజు, మెండెం ఆనంద్, కిషోర్ పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కైకలూరులోని తాలూకా సెంటర్లలో ఆయన విగ్రహానికి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ దండే పుష్పలత, ఎంపిపి అడవి కృష్ణ, మాల మహాసేన నాయకులు, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కైకలూరు, వరహాపట్నం, దొడ్డిపట్ల, పల్లేవాడ తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : భాస్కరరావుపేటలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మంగం సురేష్, సర్పంచి గద్దే ఆనంద్, మట్టగుంటలో ఎస్‌సి సెల్ నాయకులు బళ్ల రాజు, కొండంగిలో ఎస్‌సి సంఘం నాయకులు బోడిగడ్డ కిషోర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషపు మహంకాళరావు, జక్కుల మహేష్, రైతు సంఘం నాయకులు వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీను, కెవిపిఎస్ నాయకులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే జగన్ లక్ష్యం : కోటగిరి

ప్రజాశక్తి - ముసునూరు

పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే సిఎం జగన్ లక్ష్యమని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, ఎంపిడిఒ బసవరాజుఅచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానాయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతీ ఇంటికి నీరు అందించే ఉద్దేశంతో వలసపల్లి, గోపవరం, కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి గ్రామాల్లో వాటర్‌ట్యాంకుల నిర్మాణం, మోటార్ల ఏర్పాటు, పైపు లైన్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ నెల 21న సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా రెండో విడత ఇంటి నిర్మాణాలకు మండలంలో భూమి పూజ చేస్తామని చెప్పారు. వైసిపి మండల అధ్యక్షులు ఎం. నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే ధాన్యంలో తేమ శాతం లేకుండా రైతులు చూసుకోవాలన్నారు. ఆర్‌బికెల ద్వారా రైతులకు మందులు పిచికారీకి డ్రోన్లు అందించడం, ఛార్జింగ్ పంపులు, తైవాన్ స్ప్రేయర్లు, ఇవ్వడం, ధాన్యంపై కప్పుకోవడానికి టార్పలిన్లు రైతులకు ఇవ్వాలని వ్యవసాయాధికాలకు సూచించారు. అలాగే విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడుతూ ముసునూరు మండలాన్ని డార్క్ ఏరియా నుండి తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ బి.ఎ.సత్యనారాయణ, ఎఒ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్, కాట్రేనిపాడు ఎంపిటిసి సూర్యదేవర శ్రీనివాసరావు నాగమంజుల, సర్పంచులు పేరం కృష్ణ, నక్కనబోయిన సత్యనారాయణ, రంగు ధనలక్ష్మిగాంధీ, గద్దల సుహాసిని, మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు గాయపడ్డారు. క్షతగాత్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుట్లగట్లగూడేనికి చెందిన గంట వెంకన్న(40), అతని కుమారుడు తేజ(14) ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వైపు వస్తున్నారు. మద్ది ఆలయ సమీపంలో ఆగిఉన్న ఆర్‌టిసి బస్సును తప్పించి క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ తరుణంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి కళ్లమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

2 కేజీల వెండి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సింగరాయపాలెంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం ఏర్పాటుకు దాతలు మంగళవారం వెండిని అందించారు. హైదరాబాద్‌కు చెందిన రామ్మోహన్‌రావు, సునీత దంపతుల కుమారుడు ఉజ్వల్ కార్తికేయ రెండు కేజీల 13 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఛైర్మన్ నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ సంధ్యకు అందచేశారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పొనుకుమాడు గ్రామానికి కొప్పెర్ల నాగరాజు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

సచివాలయ లైన్‌మెన్ మృతి తీరనిలోటు

మండవల్లి: రోడ్డు ప్రమాదంలో సచివాలయ విద్యుత్ లైన్‌మెన్ మణికుమార్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని పలువురు అధికారులు, నాయకులు పేర్కొన్నారు. సోమవారం మృతిచెందిన మణికుమార్ అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికుమార్ కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, డిఎల్‌డిఒ మురళీ, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, కైకలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయమంగళ వెంకటరమణ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు, సర్పంచి జాన్సీ, విఆర్ఒ కమల్ హాసన్, కార్యదర్శి శ్రీనివాస్, ట్రాన్స్‌కో డిఇఇ జి.రామకృష్ణ, ఎలక్ట్రికల్ కార్యాలయ సిబ్బంది కుటుంబానికి సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రముఖులు

బిసిలను విస్మరించిన సిఎం జగన్ : టిడిపి

ప్రజాశక్తి - చాట్రాయి

బిసిలను వైసిపి పూర్తిగా విస్మరించిందని మాజీ ఎంపిపి కందుల కృష్ణ విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో మాత్రమే బిసిల అభివృద్ధి జరిగిం దన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ, పలగాని లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, వంగల సుబ్బారావు పాల్గొన్నారు.

11న వైద్యఉద్యోగుల సభను జయప్రదం చేయాలి

ఏలూరు టౌన్: ఈనెల 11వ తేదీన జరిగే వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ మహాజనసభను జయప్రదం చేయాలని ఎపి పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్-3194 జిల్లా కార్యదర్శి జె.గోవింద రావు సూచించారు. స్థానిక వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బందిపై తీవ్రమైన పని ఒత్తిడి ఉందని, దీనివల్ల అనేకమంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా మూడుసార్లు ఫేషియల్ బయోమెట్రివేటివ్, జీతాలకు లింక్ అప్ చేయడం, దాదాపుగా 30 రకాల యాప్‌లు ప్రతీరోజు అప్‌లోడ్ చేయడం, 20 సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయకపోవడం, జీతభత్యాల సమస్య, 143 జిఒ సవరించాలనే సమస్యలపై చర్చించడానికి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఈ సభకు రాష్ట్ర అధ్యక్షులు ఆస్కరరావు విచ్చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు రవితేజ, భారతి, ఎంపిహెచ్ఒ కృష్ణారావు, పిహెచ్ఎన్ నాగమల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ అనురాధ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

In The Court Of The Pril. Junior Civil Judge :: Tanuku
I.A.No. 556/2021 in O.S.No. 401/2017

Between:
Chinta Venkata Reddy & Others
...Petitioners /Plaintiffs
AND
Karri Satyanarayana Reddy (Died) & Others
...Respondents /Defendants

Proposed L.R.
5: Kovvuri Bala Santyoshi Lova Lakshmi, W/o. Sandeep Kumar, Female, age 22 Years, Pali Village, Attili Mandal TJCJC.

పిటీషనరు తరుపున దాఖలు చేసిన ప్రకటన

పై నెంబరు గ్రంధములో 1వ ప్రతివాదిని వారసులుగా చేర్చమని కోర్టు పలుమార్లు నోటీసు పంపించిననూ అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.19-12-2022వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ తరుపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు, అడ్వకేట్, తణుకు.
05-12-22. సెల్: 94406 07793

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి : ఏలూరు
ఇ.పి.నెం. 40/2019
ఒ.యస్.నెం. 367/2015

బిట్వీన్:
వేటుకూరి వెంకట సూర్యనారాయణ రాజు
...పిటీషనర్ /డిక్రీ హోల్డర్
మరియు
చింతలపాటి దుర్గారాణి
...రెస్పాండెంటు/ జడ్జిమెంటు డెటారు

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల ఇ.పి. వారంటు గ్రంధములో శ్రీ కోర్టు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.26-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయుదురు.** ఆసక్తి ఉన్న వారు సదరు వేలంలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడరు గారిని సంప్రదించగలరు.

షెడ్యూలు

అయిటం-1: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, భీమడోలు సబ్ రిజిస్ట్రీ ఇలాక భీమడోలు మండలం, పూళ్ళ శివారు సాయన్నపాలెం గ్రామం దాఖలా రి.స.నెం. 1444/3 మరియు 1444/4 దాఖలా 573 1/2 చ॥గ॥ల స్థలం బ్లాక్ నెం.18లో డో.నెం. 18-99 గల ఆర్.సి.సి. బిల్డింగ్‌కు హద్దులు:
తూర్పు: ఇరిగేషన్ కెనాల్ బ్యాంక్ (మురుగు కాల్వ) -60 అ॥లు.
దక్షిణం: చింతలపాటి వెంకట సుబ్బరాజు మరియు రామచంద్రరాజు గార్ల జాయింటు చెరువు గట్టు -51 అ॥లు.
పడమర: చింతలపాటి రామచంద్రరాజు గారి స్థలం -93 అ॥లు.
ఉత్తరం: 2వ అయిటం -93 అ॥లు.
అయిటం-2: సదరు గ్రామం దాఖలా రి.స.నెం. 1444/3 మరియు 1444/7 బ్లాక్ నెం.18లో గల 124 చ॥గ॥ల స్థలంకు హద్దులు:
తూర్పు: ఇరిగేషన్ కెనాల్ బ్యాక్ (మురుగు కాల్వ) -12 అ॥లు.
దక్షిణం: 1వ అయిటం -93 అ॥లు.
పడమర: చింతలపాటి రామచంద్రరాజు గారి స్థలం -12 అ॥లు.
ఉత్తరం: కటారి కాశి విశ్వనాథరాజు గారి భూమి -93 అ॥లు.

పై హద్దుల మధ్య అనిర్దిష్టపు సగం వాటా అనగా 124 చ॥గ॥లలో 62 చ॥గ॥లు పై రెండు అయిటములు వెరశి 635 1/2 చ॥గ॥లు స్థలం అందలి ఆర్.సి.సి. బిల్డింగుతో సహా.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.6,00,000/-
అమీనా విలువ : రూ.15,00,000/-

ఆవుల జగన్మోహనరావు
ఏలూరు, **పుప్పాల రామకృష్ణ**
02-12-22. అడ్వకేట్స్, ఏలూరు.

NOTICE FOR ISSUE OF DUPLICATE SHARE CERTIFICATES
JEEVAN SCIENTIFIC TECHNOLOGY LIMITED
Plot No. 1&2, SaiKrupa Enclave, Near Lanco Hills, Golconda Post, Hyderabad - 500008 (TS)

Notice is hereby given that the Original Share Certificates details of which are furnished hereunder, have been reported lost/misplaced and pursuant to request received from the Registered Shareholder, the Company intends to issue Duplicate Share Certificates against the said Original Share Certificates after completion of the requisite formalities under the provisions of Companies Act 1956 / SEBI Guidelines.

Folio No.	Name	Cert.No	Dist.Nos	No.of Shares
JSL000205	Ravindra Ginjupalli	219	1801601-1821600	20000

Any person, having objection for the proposed issue of Duplicate Share Certificates, may submit the same in writing with valid reasons to the Company at its Registered Office within 15 days from the date of publication of this Notice. The public is hereby cautioned against purchasing / dealing in the aforementioned Share Certificates.

It is further notified that the Company would proceed for issue of Duplicate Share Certificates, if no valid objection is received within the stipulated time hereof.

Place : Hyderabad. ***Authorised Signatory***